క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రాజేష్

సీతానగరం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఎస్సై ఎం.రాజేష్ కోరారు. మండలంలోని జోగింపేట గ్రామస్తులతో బుధవారం రాత్రి సమావేశమయ్యారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అల్లర్లకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

90 మందికి వైద్యసేవలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

పార్వతీపురంటౌన్: మండలంలోని వెంకంపేట గ్రామంలో 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు శ్రీకాంత్, వైద్య సిబ్బంది గ్రామంలోని సుమారు 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి, గర్భిణులు, బాలింతలకు అవసరమైన వైద్య సేవలందించారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ప్రతీ గ్రామంలో నెలకు రెండు సార్లు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గడ్డివాములు దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సీతానగరం: మండలంలోని గుచ్చిమి కళ్లాల్లో గురువారం సంభవించిన అగ్ని ప్రమాదంలో పశువుల మేతకని ఉంచిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రైతులు టి.నారాయణరావు, జి.వెంకటరమణ, ఎస్.తిరుపతిరావు, అప్పలనాయుడు పశువుల మేతకోసం కళ్లాల్లో నిలువచేసిన గడ్డికుప్పలు దగ్ధమయ్యాయి. గ్రామస్తుల సమాచారం మేరకు పార్వతీపురం అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు.

సాలికిరిలో సామూహిక వ్రతాలు



సామూహిక వ్రతాలలో పాల్గొన్న భక్తులు

భామిని: మండలంలోని సాలికిరిలో వెలసిన శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత సత్యనారాయణ ఆలయంలో గురువారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉపాలయాలుగా శ్రీలక్ష్మి, గణేశుడు, గరుక్మంతుడు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఆలయ పురోహితులు ఆధ్వర్యంలో పూజలు చేశారు.

విత్తనాల సేకరణ



సేకరించిన విత్తనాలను పరిశీలిస్తున్న డీపీఎం పి.షన్ముఖరాజు

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయం సాగులో మరింత ప్రోత్సాహం అందించేందుకు నవధాన్యాల విత్తనాలను రైతుల నుంచి సేకరిస్తున్నట్లు డీపీఎం పి.షన్ముఖరాజు తెలిపారు. మండలంలోని మండ గ్రామంలో జ్యోతి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు రైతుల నుంచి 12 రకాల విత్తనాలను కలిపి మొత్తం 120 కేజీలను గురువారం సేకరించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన డీపీఎం మాట్లాడుతూ రైతుల నుంచి సేకరించిన విత్తనాలతో నవధాన్యాల కిట్లను తయారు చేస్తామని, వాటిని మళ్లీ రైతులకు ఇచ్చి నవధాన్యాల సాగుపై ప్రోత్సాహం అందించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఎంఎల్‌టీ గణేష్, ఎంటి జి.నిర్మలాదేవి, ఎల్1 ప్రసాద్, ఐసీఆర్‌పీలు ఉన్నారు.

మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే..

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జోగారావు



సీతానగరం: ఎమ్మెల్యే జోగారావుకు విజయతిలకం దిద్దుతున్న మహిళ

పార్వతీపురంటౌన్: ప్రజా మద్దతుతో మళ్లీ గెలిచేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని ఎమ్మార్‌నగరం, పిన్నింటి రామినాయుడువలస, గోపాలపురం గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేశారని గుర్తుచేశారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల జీవన స్థితిగతులను మెరుగుపరిచారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, ఇంటి వద్దకే అన్ని ప్రభుత్వ సేవలు చేరవేస్తున్నారని అన్నారు. మహిళా సాధికారతలకు ప్రాధాన్యం ఇస్తూ వారి పేరుపై పథకాలు అందించినట్లు చెప్పారు. మీకు మంచి జరిగిందని అనిపిస్తే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని, మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ప్రతీ గడప వద్ద మహిళలు హారతులు ఇచ్చి విజయతిలకం దిద్ది ఎమ్మెల్యే జోగారావుకు ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఎంపీటీసీ బడే రామారావు, సర్పంచ్ పెంట ప్రవంతి, వైస్ ఎంపీపీ పోల సత్యనారాయణ, యాళ్ల ఈశ్వరప్రతాప్, మజ్జి శేఖర్, ముప్పల సత్యంనాయుడు, పల్లి భాను ప్రకాష్, పీఏసీఎస్ చైర్మన్లు కాపారపు సత్యనారాయణ, తీళ్ల సివున్నాయుడు, పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ వెంపలి గురురాజు, ఆత్మ చైర్మన్ వై.తిరుపతిరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు గండి శంకరరావు, మడక విశ్వనాథం, బడే శ్రీరంజన్, సచివాలయ కన్వీనర్లు ఇట్లా సూర్యనారాయణ, చందకదేశాలు, నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం

సీతానగరం: సంక్షేమ పథకాలతో పేదల కుటుంబాల్లో సంతోషాలు నింపిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని, మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఆయనకు మద్దతుగా నిలుద్దామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. మండలంలోని పెదబోగిలిలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మాజీ ఎమ్మెల్యే ఎస్.జయమణితో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. మంచి జరిగిందని మీకు అనిపిస్తే.. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా జోగారావును, ఎంపీగా డాక్టర్ తనూజారాణిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ నాయకులు బి.శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, ఎంపీటీసీ ఎస్.గౌరీ, పీఏసీఎస్ చైర్మన్ ఎస్.కూర్మారావు, స్థానిక నాయకులు కిరణ్‌కుమార్, ఎస్.లక్ష్మి, ఎస్.రామారావు, వినోద్, డి.దేవదానం, ప్రసాద్, మాధవరావు, పార్థసారధి, బొన్నాడ తిరుపతిరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్: ఎమ్మార్ నగరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



పార్వతీపురంటౌన్: పిన్నింటి రామినాయుడువలసలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జోగారావు, టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టండి



శ్రీరంగరాజపురంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న మామిడి శ్రీకాంత్, నాయకులు

- తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్

బలిజిపేట: అభివృద్ధి, సంక్షేమాన్ని అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ ఓటర్లను కోరారు. మండలంలోని శ్రీరంగరాజపురం, కొత్త గలావల్లిలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు కనీస సదుపాయాల కల్పించడంతో పాటు అడగకుండానే అనేక సంక్షేమ ఫలాలను అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలను చేరవేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సుపరిపాలన అందించిన నాయకుడికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. మే 13న జరిగే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా అలజంగి జోగారావును, అరకు ఎంపీగా తనూజారాణిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు జి.పకీరునాయుడు, జి.సత్యంనాయుడు, సూరపునాయుడు, బి.సింహాచలం, పి.గురువులు పాల్గొన్నారు.

హడావిడి అంతా మందుబాబులదే..





మద్యం షాపుల వద్ద తెలుగు తమ్ముళ్లు

పార్వతీపురం టౌన్: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర నామినేషన్ సందర్భంగా పార్వతీపురం పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణవాసులు, వాహన చోదకులు ట్రాఫిక్‌లో చిక్కుకుని మండుటెండలో ఇబ్బందులు పడ్డారు. మందుబాబులకు మద్యం ఏరులై పారించారు. ర్యాలీలోనే మందుబాబులు మద్యం షాపుల వైపు పరుగులు తీశారు. కొంతమంది మద్యం ఎక్కువగా సేవించి రోడ్లపై పడ్డారు. వారికి చికిత్స అందించేందుకు 108 వాహనంలో ఆస్పత్రులకు తరలించారు. ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ రూ.200, మందు అందించినట్లు స్వయానా తెలుగు తమ్ముళ్లే చెపుతున్నారు. రూ.200 ఇస్తామని ఆశపెట్టి ఎండలో ర్యాలీ నిర్వహించి కొంతమందికి పేమెంట్లు అందకపోవడంతో తమ్ముళ్లు తీవ్ర నిరాశకు గురయ్యారు.

సాలూరు అసెంబ్లీ స్థానానికి 17 నామినేషన్లు

సాలూరు: సాలూరు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి గురువారం ఏడుగురు అభ్యర్థులు 8 నామినేషన్లు వేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి పీడిక రాజన్నదొర, టీడీపీ నుంచి గుమ్మడి సంధ్యారాణి, గుమ్మడి పృథ్వీ, కాంగ్రెస్ పార్టీ నుంచి ముప్పల పుష్పారావు, సమాజ్‌వాది పార్టీ నుంచి పూసూరు సాయి, బహుజన సమాజ్ పార్టీ నుంచి ముప్పల జ్ఞానప్రకాశం, స్వతంత్ర్య అభ్యర్థిగా గేదెల రామకృష్ణ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్‌ఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి. సాలూరు అసెంబ్లీ స్థానానికి మొత్తం 17 నామినేషన్లు దాఖలయ్యాయి.

ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించండి



మహిళకు కరపత్రాన్ని అందజేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న రాజన్నదొర

- ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ స్పీకర్ రాజన్నదొర

సాలూరు: ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని, సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని డిప్యూటీ సీఎం, సాలూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర కోరారు. పట్టణంలోని పీఎస్ బొడ్డవలసలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా వీధిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ప్రతీ గడపలో రాజన్నదొరకు అపూర్వ స్వాగతం లభించింది. మహిళలు హారతులు ఇచ్చి విజయతిలకం దిద్దారు. అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేయడమే తన అజెండా అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించడంతో పాటు కోట్లాది రుపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తుచేశారు. ప్రజలకు మంచి చేసింది జగన్‌మోహన్‌రెడ్డి అయితే, ప్రజలను మోసం చేసింది చంద్రబాబని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. ఇప్పుడు ఎన్నికల రావడంతో ప్రజలను మరోసారి మోసం చేసేందుక చంద్రబాబు, టీడీపీ నాయకులు వస్తున్నారని, వారిని నమ్మి మోసపోవద్దని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తనూజారాణిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో జై జగన్, జై రాజన్నదొర నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. కార్యక్రమంలో పార్టీ నాయకులు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, గిరి రఘు, బొన్నాడ కృష్ణ, రాపాక మాధవరావు, గొర్లె వెంకటరమణ, సింగారపు ఈశ్వరరావు, పప్ప లక్ష్మణరావు, తీగల బలరాం, గునివాడ గోవింద, తిరుపతి, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండానే?



సాలూరులో టీడీపీ ర్యాలి కోసం వినియోగించిన వాహనాలు

సాలూరు: టీడీపీ సాలూరు నియోజకవర్గ అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి గురువారం సాలూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పెద్దదిగా కనిపించాలన్న ఉద్దేశంతో అధిక సంఖ్యలో ఆటోలు, మ్యాక్సి క్యాబ్‌లు, ట్రాక్టర్లు తదితర వాహనాలను వినియోగించారు. వాటిలో జనాలు తరలించారు. వాహనాలకు పార్టీ జెండాలు కట్టారు. వాస్తవంగా ప్రచారానికి వినియోగించే వాహనాలకు ఎన్నికల అధికారుల నుంచి ముందస్తుగా అనుమతులు తీసుకోవాలి. ఎన్నికల నిబంధనలను పక్కనపెట్టి అధిక వాహనాలను ర్యాలీలో వినియోగించినట్టు సమాచారం. అనుమతులు లేకుండా వాహనాలకు పార్టీ జెండాలు కట్టి వినియోగించడంపై ఎన్నికల అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారన్న చర్చ పట్టణంలో సాగుతోంది.

దోమల నివారణతోనే మలేరియా నిర్మూలన



ప్రదర్శనలో నినాదాలు చేస్తున్న వైద్య సిబ్బంది

భామిని: భామిని పీహెచ్‌సీ వద్ద దోమలు నిర్మూలిద్దాం...మలేరియాను పాలద్రోలుదాం..అంటూ గురువారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ మలేరియా దినం సందర్భంగా నిర్మూలన కార్యక్రమాలపై భామిని వైద్యాధికారి డాక్టర్ పసుపులేటి సోయల్ ఆధ్వర్యంలో ప్రదర్శన చేపట్టారు. సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు సారథ్యంలో దోమల నిర్మూలన నినాదాలు చేశారు. సీహెచ్‌ఓ సిహెచ్.భాస్కరరావు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



గుమడాం నుంచి పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: నియోజకవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు పెరుగుతున్నాయి. సాలూరు పట్టణం, పాచిపెంట మండలాల నుంచి పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. డిప్యూటీ సీఎం, సాలూరు అసెంబ్లీ అభ్యర్థి పీడిక రాజన్నదొర నివాసంలో వారంతా వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి రాజన్నదొర కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

- గుమడాం నుంచి 20 కుటుంబాలు

పట్టణంలో గుమడాం నుంచి టీడీపీకి చెందిన 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. స్థానిక కౌన్సిలర్ తాడ్డి శంకరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు వంగపండు వెంకటేష్, సింహాచలం, దొంతల సన్యాసినాయుడు, రమేష్, శంకరరావు, వెంకన్న, బంటు లక్ష్మణ, మరడాల వెంకటనాయుడుతో పాటు మరికొంత మంది వైఎస్సార్‌సీపీలో చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, గిరిరఘు తదితరులు పాల్గొన్నారు.

- మోసూరు నుంచి మరో 20 కుటుంబాలు

పాచిపెంట మండలం మోసూరుకు చెందిన రావాడ సింహాచలం, పెంటయ్య, గణపతి, రాము, శ్రీను, దాలయ్య, తదితర 20 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ గండిపల్లి రాము ఆధ్వర్యంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికి రాజన్నదొర కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జి, జేసీఎస్ కన్వీనర్ తట్టికాయల గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- కుమ్మరివీధి నుంచి 30 మహిళలు చేరిక

పట్టణంలో 15వ వార్డు కుమ్మరివీధి నుంచి బాకి ఈశ్వరమ్మ, మొక్క లక్ష్మి, సబ్బవరపు ఈశ్వరమ్మ, బసర కృష్ణ, పి.అప్పయమ్మ, ఆముదాల ఈశ్వరమ్మ, సరస్వతి, నీలిమతో పాటు సుమారు 30 మంది మహిళలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక నాయకులు జాగరపు రమేష్, కొండ్రు శివ, వెంక శ్రీను, రౌతు సురేష్, పిరిడి రామకృష్ణ ఆధ్వర్యంలో వీరంతా వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, నాయకులు గిరి రఘు, జర్జాపు సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన మోసూరు కార్యకర్తలతో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



పార్టీలో చేరిన కుమ్మరివీధి మహిళలతో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి

- డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

గుమ్మలక్ష్మీపురం: రక్తహీనత నివారణపై వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ ఆర్ఐటీఐ వద్ద గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోని పీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి పలు ఆరోగ్య కార్యక్రమాలపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, శిశువులు, కిశోర బాలికల్లో రక్తహీనతను గుర్తిస్తే తక్షణమే నివారణ చర్యలు చేపట్టి హిమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందే వరకు పర్యవేక్షణ చేయాలన్నారు. మొదటి త్రైమాసికంలోనే గర్భిణుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలని, తద్వారా హైరిస్క్ గర్భిణులను సులభంగా గుర్తించవచ్చన్నారు. అలాగే శిశు ఆరోగ్య పర్యవేక్షణ కూడా అవసరమేనని, టీకాలు, బరువు, శ్వాస ప్రక్రియ తదితర వాటిపై దృష్టి సారించాలన్నారు. ప్రీజం 10 పక్కాగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియా ప్రభావిత ప్రాంతాలలో జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జ్వర నిర్ధారణ పరీక్షలు సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. వేసవి రీత్యా వడదెబ్బ, డీహైడ్రేషన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించి, జాగ్రత్తలు తెలియజేయాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ప్రతీ ఆరోగ్య కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.